# వైఎస్ఆర్-అన్నమయ్య

తెలుగు జాతీయ దినపత్రిక

వార్త

శనివారం 15 జూలై 2023


## ప్రజా సంక్షేమ సారధి జగనన్న

పులివెందుల రూరల్, జూలై 14, ప్రభాతవార్త :



రాష్ట్రంలో అన్నివర్గాల ప్రజల అభ్యున్నతికి కృషిచేస్తున్న మహోన్నత వ్యక్తి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి అన్నారు. శుక్రవారం కనంపల్లెలో గడపగడపకు వైకాపా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీ పాల్గొని ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ రాష్ట్రంలో అన్నివర్గాల ప్రజలు రాజకీయ, ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు అన్నిరకాల పథకాలను ప్రజలకు అందజేయడం జరుగుతుందని, ఇంకనూ అర్హత కలిగి ఉండి సంక్షేమ పథకాలకు దూరంగా ఉన్న వారిని గ్రహించేందుకు ఎప్పటికప్పుడు ఈ విధమైన కార్యక్రమాలతో ప్రజల ముందుకు రావడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పాడా ఓఎస్డీ అనీల్‌కుమార్‌రెడ్డి, వైకాపా నాయకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## భూకబ్జాను అడ్డుకున్న దళితులు

నందలూరు, జులై 14 ప్రభాతవార్త



కబ్జాకి గురైన స్థలం (ఫైల్ ఫొటో)

నందలూరు మండలంలోని పాటూరు గ్రామ పంచాయతీ ఎర్రిపాపయ్యగారిపల్లె గ్రామం దళితవాడ నివాస స్థలం కోసం ప్రభుత్వం 1054/1 సర్వేనంబరులో 5 సెంట్ల చొప్పున కేటాయించడం జరిగిన సంగతి విధితమే. అదే గ్రామానికి సమీపంలో ఉండే చంగల్‌రెడ్డి అనేవ్యక్తి ఆ దళితుల భూమిని కబ్జా చేయాలనే ఉద్దేశ్యంతో అక్కడ 108 లింకుల రోడ్ ఉందని జెసిబి తెచ్చి వారి స్థలంను ఎవరి అనుమతి లేకుండా చెట్లని తీసివేయడం చేశారని అనిపైన స్థానిక పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేయడం జరిగిందని స్థలం యజమానులు సిద్దవరం పాల కొండయ్య, పాలతోట్టి సుబ్బరాయుడు, నారాయణ తెలిపారు. దీనిపై స్థానిక ఎస్ఐ అబ్దుల్ జహీర్ మాట్లాడుతూ రెవెన్యూ అదికారుల దగ్గర పూర్తి సమాచారం సేకరించి అనంతరం అతనిపై చర్యలు తీసుకుంటామని ఫిర్యాదుదారులకు తెలిపారు.

# రైతు కంట కన్నీరు

**చెరువు నిండా నీరు... సాగు చేయని రైతు...**

**బూడిపోయిన కాలువలు**

**కాలువల గుండా పొలాలకు చేరని నీరు**

**పట్టించుకోని అధికారులు**

**లబోదిబోమంటున్న రైతులు**



పెద్ద చెరువులో పుష్కలంగా ఉన్న నీరు.

బద్వేలు, జూలై 14 ప్రభాతవార్త :

చెరువులో నీరు ఉన్నా రైతులు పంటలు పండించలేని పరిస్థితిలో ఉన్నారు. ఇప్పటికే రైతులు పంట సాగు చేయడంలో వెనకడుగు వేస్తూ దిగుబడి తగ్గిపోతుందని పొలాల వైపే చూడడం మానేశారు. కానీ చెరువు కింద ఉన్న రైతులు పొలాలనే నమ్ముకున్న రైతులు విధిలేని పరిస్థితుల్లో పంటలు సాగుచేసే పరిస్థితి ఏర్పడింది. బద్వేలు పరిసర ప్రాంతాలలో ఎక్కడ చూసినా అధిక శాతం వరి సాగు చేయడం జరుగుతుంది. ఈ సారి పూర్తిగా పంటలు సాగు చేయడంలో నిర్లక్ష్యం చూపుతున్నారు. బద్వేలు పెద్ద చెరువు కింద దాదాపు అధికారికంగా 10 వేల ఎకరాలు పైగా ఉండగా అనధికారికంగా 15 వేల ఎకరాలు భూమి సాగులో ఉంది. గత వర్షా కాలం నుండి నేటి వరకూ చెరువులో పుష్కలంగా నీరు ఉన్నప్పటికీ చెరువు క్రింద కూడా పంటలు సాగు చేయలేదంటే నీళ్లు లేవనే చెబుతున్నారు. తూముల గుండా వెళ్ళే కాలువలు పూర్తిగా బూడిపోవడమే కాకుండా పిచ్చి మొక్కలు మొలిచి పొలాలకు సమానంగా కాలువలు ఏర్పడ్డాయి. దీని వల్ల ఒక్క చుక్క నీరు కూడా చెరువులో నుండి కాలువల గుండా రాకపోవడంతో రైతులు పంటలు పండించలేని పరిస్థితి ఏర్పడుతుంది. ఒక పక్క ప్రభుత్వం రైతులను ఆదుకుంటున్నామని చెబుతున్నా, అధికారుల పర్యవేక్షణ



పూడిక తీయకపోవడంతో బూడిపోయిన కాలువలు.

జరుగుతుందని చెబుతున్నప్పటికీ ప్రత్యక్షంగా అలాంటి సంఘటనలు ఒక్కటి కూడా అధికారులు పరిష్కరించిన పాపాన పోలేదు. కాలువలు బూడిపోతే వాటిని తొలగించాల్సిన బాధ్యత అధికారులపై ఉన్నా ఇంత వరకూ చర్యలు తీసుకోలేదు. గత ప్రభుత్వంలో వేసవిలో కాలువలలో పూడిక తీసి వర్షా కాలం వచ్చే సమయానికి చెరువు నిండా నీరు ఉన్నపుడు తూముల గుండా కాలువల మీదుగా నీరు పంట పొలాలకు చేరుతాయి. కానీ ఈ సారి పూర్తిగా పంట కాలువలను పట్టించుకోక పోవడంతో నీరు వదిలినా పొలాలకు చేరని పరిస్థితి ఏర్పడుతుంది. ఇప్పటికే పంట కాలువలు పూర్తిగా దెబ్బతిని నీరంతా ఎటుపడితే అటు పోవడం, పంట కాలువల గుండా వెళ్ళకపోవడం, వాటి కింద ఉన్న ఎకరాల కొద్దీ భూములు బీడులుగా మారడం జరుగుతుంది. ఒక ఎకరా కూడా రైతు పంట సాగు చేయలేని పరిస్థితిలో ఉన్నారంటే పరిస్థితి ఎలా ఉందో అర్థమవుతుంది. రైతు కంట కన్నీరు తప్ప... రైతు లాభపడింది ఏమీ లేదు. లక్షలు ఖర్చు పెట్టి పంటలు సాగు చేస్తే ఇలా పంట పొలాలకు సక్రమంగా నీరు అందకపోతే పెట్టిన పెట్టుబడి రాక రైతు ఆత్మహత్య తప్ప మరొక గత్యంతరం లేదు. అంతే కాకుండా ఈ ప్రాంతం అంతా వ్యవసాయంపై ఆధారపడి జీవించే కుటుంబాలు. రైతు మూడు కార్లు పండిస్తే వ్యాపారాలు కూడా అభివృద్ధి చెందడమే కాకుండా రైతు ఇంట ఎప్పటికీ ధాన్యం కళకళలాడుతుంది. ఇక్కడ అధికారుల నిర్లక్ష్యమో, ప్రజా ప్రతినిధుల అలసత్వమో తెలియదు కానీ బూడిపోయిన కాలువలలో మరమ్మత్తులు చేపట్టకపోవడం వలన రైతు పూర్తిగా పంట పొలాల వైపు చూడడమే మానేశారు. ఒక పక్క చెరువులో నీరు ఉన్నా పంటలు సాగు చేయలేని పరిస్థితి ఎక్కడైనా ఉందంటే అది బద్వేలులో మాత్రమే అని చెప్పవచ్చు. పక్క జిల్లాల్లో నీరు పుష్కలంగా ఉండడం వలన రైతు ఏదో ఒక పంటపై ఆధారపడి జీవించడం జరుగుతుంది. ఇక్కడ నీరు ఉన్నా పంట సాగు చేయలేని దుస్థితి.

## ఎస్సీ, ఎస్టీ కేసును దర్యాప్తు చేపట్టిన మదనపల్లె డీఎస్పీ సుధాకర్

పీలేరు, జూలై 14 ప్రభాతవార్త:5



మండలంలోని బోదుమల్లు వారిపల్లె హరిజనవాడలో ఎ స్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుకు సంబంధించి మదనపల్లె డీఎస్పీ సుదాకర్ విచారణ చేపట్టారు. ఇటీవట బోదుమల్లువారిపల్లె హరిజనవాడకు సమీపంలోని పొలంలో బోదుమల్లువారిపల్లె గ్రామ నివాసులు కురబల కులస్తులు(బీసీలు) బోదుమల్లువారిపల్లె హరిజనవాడకు చెందిన సత్యానారాయణ పై రాళ్ల దాడి చేసి తలపైన రక్తగాయాలు చేశారు. ఆర్. సత్యనారాయణ ఫిర్యాదు మేరకు ఎస్సై నరసింహులు ప్రాథమికంగా విచారించి శివ, ఆదినారాయణ, మహేంద్ర అనే వ్యక్తులపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేశారు. పై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుకు సంబంధించి మదనపల్లె డీఎస్పీ సుధా కర్ శనివారం విచారణ నిమిత్తం బోదుమల్లువారిపల్లె హరిజనవాడ సమీపంలోని సంఘటన స్థలంలో విచారణ చేపట్టారు. విచారణలో భాగంగా ఫిర్యాదు దారులను , సాక్షులను విచారించి రికార్డు చేశారు. పై కార్యక్రమంలో మదనపల్లె డీఎస్పీ సుధాకర్‌తో పాటు పీలేరు ఎస్సై నరసింహుడు, పోలీసు సిబ్బంది, గ్రామస్తులు, ఎమ్మార్పీయస్ , మాల మహానాడు నాయకులు పాల్గొన్నారు.

## సీనియర్ గ్రేడ్ గెజిటెట్ ఆఫీసర్ ఉద్యోగానికి ఎంపికైన బుక్కె ధర్మనాయక్

రాయచోటి, జూలై 14 ప్రభాతవార్త :



ఇటీవల యూపీఎస్ సి ఇండియన్ ఇన్ఫర్మేషన్ సర్వీస్ మినిస్ట్రీ ఆఫ్ ఇన్ఫర్మేషన్ అండ్ బ్రాడ్కాస్టింగ్ లో సీనియర్ గ్రేడ్ గెజిటెడ్ ఆఫీసర్ పోస్ట్ కు సంబంధించి విడుదల చేసిన ఫలితాల్లో అన్నమయ్య జిల్లా ఐ అండ్ పిఆర్ పిఆర్ ఓ బుక్కె ధర్మ నాయక్ ఎంపిక అయ్యాడు. వీరు టి.సుండుపల్లె మండలం వైఎస్ పాళెం కుప్పగుట్టపల్లెకు చెందిన వారు. యూపీపిఎస్సి ద్వారా మొత్తం 34 ఉద్యోగాలకు సంబంధించి దేశవ్యాప్తంగా 267 మంది ఇంటర్వ్యూ హాజరయ్యారు. అందులో ఎస్టీ క్యాటగిరీకి సంబంధించి పిఆర్ఓ సెలెక్ట్ కావడం జరిగింది. ఇప్పటికే సమాచార శాఖలో పౌర సంబంధాల శాఖ అధికారిగా మొదట 2019 సెప్టెంబర్ నుండి కర్నూలు లో, ప్రస్తుతం అన్నమయ్య జిల్లాలో విధులు నిర్వహిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన నవ రత్నాలు సంక్షేమ పథకాలు అభివృద్ధి కార్యక్రమాల పైన విస్తృతంగా ప్రచారం చేయడంతో జిల్లా ఇంచార్జ్ మంత్రి, కలెక్టర్ చేతుల మీదుగా ప్రశంస పత్రాలు అందుకున్నారు. ప్రాథమిక స్థాయి విద్య టి.సుండుపల్లె మెయిన్, హై స్కూల్ టి సుండుపల్లె, ఇంటర్ ఎంకెఆర్ జూనియర్ కాలేజ్, డిగ్రీ రాయచోటి హరినాథ్ రెడ్డి డిగ్రీ కాలేజ్, పీజీ మాస్ కమ్యూ నికేషన్ జర్నలిజం యోగి వేమన విశ్వవిద్యాలయంలో విద్యా భ్యాసం చేశారు. నాన్న బి వెంకటరమణ నాయక్, అమ్మ పాపులమ్మ వ్యవసాయం పై ఆధారపడిన వారు. భార్య మూడే శిరీష, ఇద్దరు పిల్లలు ప్రచేతన్ నాయక్, లిపితేష్ నాయక్ కలరు. దీంతో అన్నమయ్య జిల్లా సమాచార శాఖ జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖ అధికారి భరత్ కుమార్ రెడ్డితో పాటు డిపిఆర్ ఓ పురుషోత్తం, సమాచార శాఖ సిబ్బంది ఈ సందర్భంగా ధర్మనాయిక్ ను అభినందించారు.

## అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలి

**వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించిన రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి డాక్టర్ కె.ఎస్. జవహర్ రెడ్డి**



కడప, జూలై 14 ప్రభాతవార్త :

ప్రాధాన్యత రంగాలకు సంబంధించి అన్ని అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని.. జిల్లా కలెక్టర్ వి.విజయ్ రామరాజు సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం విజయవాడ సిఎస్ క్యాంపు కార్యాలయం నుండి స్థిరమైన అభివృద్ధి లక్ష్యాలు, వన్ డిస్ట్రిక్ట్ వన్ ప్రోడక్ట్ అవార్డు, వైద్యం, స్త్రీ శిశు సంక్షేమంలో ప్రభుత్వ పథకాలకు సంబంధించి ఎస్డిజి ఇండికేటర్స్, విద్య, జగనున్నకు చెబుదాం తదితర అంశాలపై.. అన్ని జిల్లాల కలెక్టర్ లతో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డా.కె.ఎస్.జవహర్ రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా విస్తృతంగా సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశానికి కడప కలెక్టరేట్ బోర్డు మీటింగ్ హాలు నుంచి జిల్లా కలెక్టర్ వి.విజయ్ రామరాజుతో పాటు జేసీ గణేష్ కుమార్ పాల్గొన్నారు. సీఎస్ వీడియో కాన్ఫరెన్స్ ముగిసిన అనంతరం సంబందిత శాఖల జిల్లా అధికారులతో కలెక్టర్ వి.విజయ్ రామరాజు మాట్లాడుతూ.. జిల్లాను అన్ని అంశాలలో ముందంజలో నిలిపేలా అధికారులు కృషి చేయాలని సూచించారు. ముఖ్యంగా ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతనిస్తున్న గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, అంగన్వాడి, వైయస్సార్ క్లినిక్ లు, తదితర ప్రభుత్వ శాశ్వత భవన నిర్మాణాలపై దృష్టిని సారించి వెంటనే పనులు పూర్తి చేసి ఆయా శాఖలకు అప్పగించాలని పంచాయతీరాజ్ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సమగ్ర శిక్ష, విద్యాశాఖ, ఐసిడిఎస్, మున్సిపల్, మైనర్ ఇరిగేషన్, ఏపీ ఈ డబ్ల్యూ ఐ డి సి, ఆర్ డబ్ల్యూ ఎస్, పంచాయతీరాజ్ తదితర అధికారులు పాల్గొన్నారు.

## జగనన్న పాలనలో ప్రతి కుటుంబానికి లబ్ధి

**ఎమ్మెల్యే రఘురామిరెడ్డి**

దువ్వూరు, జులై 14, ప్రభాతవార్త:



ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలనలో పార్టీలకు అతీతంగా ప్రతి కుటుంబానికి లబ్ధి కలుగుతుందని మైదుకూరు ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డి అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని కృష్ణంపల్లె గ్రామంలో జగనన్న సురక్ష కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వైకాపా ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలలో 95 శాతం హామీలు నెరవేర్చిందన్నారు. ఏ సంక్షేమ కార్యక్రమంలో అయినా అవినీతి లేకుండా లబ్ధిదా రుడి ఖాతాలో జమ అవుతోందన్నారు. ఏవైనా గ్రామంలో సమస్యలుంటే వాటిని తమ దృష్టికి తేవాలన్నారు. 50 గృహాలకు 1 వాలంటీరు, 2వేల జనాభాకు సచివాలయంతో మెరుగైన సేవలు అందిస్తున్నామన్నారు. ఏ సంక్షేమ కార్యక్రమం లో అయినా ఓటు హక్కు లేకున్నా సంక్షేమ పథకాలు అందిస్తున్నామని ఆ ఘనత వైఎస్‌దే అన్నారు. రైతు భరోసా ద్వారా ప్రతి రైతుకు ఏడాదికి రూ.13500 అందజేస్తున్నామని వృద్ధులకు సంబంధించిన పెన్షన్లు జనవరి నెల నుంచి రూ.3వేలు ఇస్తున్నామని పేర్కొన్నారు. అమ్మఒడి, విద్యా దీవెన విద్యా వసతి, వైఎస్ఆర్ భరోసా, వైఎస్ఆర్ ఆసరా వంటి పథకాల ద్వారా లబ్ధిదారులకు నేరుగా డబ్బులు జమ అవుతున్నట్లు తెలిపారు. రైతులకు ఎన్నో పథకాలు అమ లు చేస్తున్నామని అందులో భాగంగా పంటల బీమా, ఇన్‌పుట్ సబ్సిడీ తదితర వాటిని పంట ముగిసిన వెంటనే వేస్తున్నట్లు తెలిపారు. చంద్రబాబు గతంలో ఎన్నో వాగ్దానాలు చేసి ఏమీ అమలు చేయలేదన్నారు. రుణమాఫీ పేరుతో మోసం చేశాడని, మహిళలకు డ్వాక్రా రుణాలు మాఫీ చేయలేదన్నారు. తెదేపా మాటలు నమ్మి మోసపోవద్దని మంచి చేసిన వారికి ఓటు వేయాలన్నారు. తాము చేసిన పనులను ఇంటింటికి వెళ్లి వివరించి తాము మంచి చేసి ఉంటే జగన్‌కు ఓటు వేయాలని కోరుతున్నామన్నారు. అలాగే జగనన్న సురక్షలో భాగంగా గ్రామస్థులకు వివిధ సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కానాల జయచంద్రారెడ్డి, ఎంపీటీసీ ఏరువ కృష్ణయ్య, సర్పంచ్ ఏరువ నాగులు, ఎంపీటీ సీలు, ఎంపీడీవో జగదీశ్వర్‌రెడ్డి, తహసీల్దార్ రమాకుమారి, వ్యవసాయాధికారి అమర్‌నాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## జగనన్న సురక్ష కార్యక్రమంతోనే పేద ప్రజలకు సంక్షేమ పథకాలు

**ఉపముఖ్యమంత్రి ఎస్.బి. అంజాద్ బాష**

కడప, జూలై 14 ప్రభాతవార్త :



రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వంలో జగనన్న సురక్ష కార్యక్రమం తోనే పేద ప్రజలకు సంక్షేమ పథకాలు అందించడం జరుగుతోందని ఉపముఖ్యమంత్రి ఎస్.బి.అంజాద్ బాషా, నగర మేయర్ కె.సురేష్ బాబులు సంయుక్తంగా అన్నారు. శుక్రవారం కడప నగరంలోని 36, 37, 50 వ డివిజన్లలోని సచివాలయాల్లో.. రాష్ట్ర ఉపముఖ్యమంత్రి ఎస్.బి.అంజాద్ బాషా.. ఆయా డివిజన్ల కార్పొరేటర్లు, అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులతో కలిసి "జగనన్న సురక్ష" శిబిరాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి ఎస్ బి అంజాద్ బాషా మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం లో జగనన్న సురక్ష కార్యక్రమం తోనే పేద ప్రజలకు సంక్షేమ పథకాలు అందించడం జరుగుతోందని అన్నారు. ఈ పథకాలు ఇప్పటికే 99 శాతానికి పైగా లబ్ధిదారులకు చేరవయ్యాయని.. వివిధ కారణాల వల్ల పథకాలు అందకుండా మిగిలిపోయిన వారికి కూడా పథకాలు అందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తోందని తెలిపారు. సురక్ష శిబిరాలలో కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, ఆధార్ కార్డు, రేషన్ కార్డ్ లలో చేర్పులు మార్పులు తదితరాలకు సంబంధించి పలు రకాల సర్టిఫికెట్లను ఉచితంగా అందిస్తున్నట్లు తెలిపారు. ఈ నెల 30వ తేదీ వరకు "జగనన్న సురక్ష" కార్యక్రమం జరుగుతుందన్నారు. నగర మేయర్ సురేష్ బాబు మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వంలో "జగనన్న సురక్ష" కార్యక్రమం ద్వారా ఈ విధంగా దేశంలో ఎక్కడా లేనివిధంగా "జగనన్న సురక్ష" కార్యక్రమం ద్వారా ప్రజల ఇంటి వద్దకే వచ్చి సంక్షేమ పథకాలను అందించే ఘనత ఈ ప్రభుత్వానిదేనన్నారు. ప్రజలు విరివిగా భాగస్వాములై సమస్యలను పరిష్కరించుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ నిత్యానంద రెడ్డి, మార్కెట్ యార్డు చైర్మన్ బంగారు నాగయ్య, వైస్ ఛైర్మన్ ఇబ్రహీం మియా, స్థానిక కార్పొరేటర్లు ఇతర కార్పొరేటర్లు షేక్ మహమ్మద్ షఫీ, నాయకులు నరపురెడ్డి సుబ్బారెడ్డి, రమేష్ రెడ్డి సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

## తువ్వపల్లిలో జగనన్న సురక్ష కార్యక్రమం

మైదుకూరు, జులై 14, ప్రభాతవార్త :



మైదుకూరు మండల పరిధిలోని తువ్వపల్లె సచివాలయ పరిధిలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తువ్వపల్లి సచివాలయ పరిధిలో అర్హత కలిగి అర్జీలు పెట్టుకున్న రైతులకు 1002 రకాల పత్రాలను అందజేశామని మైదుకూరు మండల రెవెన్యూ ఆఫీసర్ అనురాధ తెలిపారు. అనంతరం ఆమె మాట్లాడుతూ మాకు అందిన ప్రతి అర్జీని సత్వరమే పరిష్కరించి లబ్దిదారులకు అందే విధంగా చూస్తామని చెప్పారు. వైయస్సార్ రైతు భరోసా మరియు పిఎం కిసాన్ 475మందికి, 2022 సంవత్సరానికి సంబంధించి క్రాఫ్ట్ ఇన్సూరెన్స్ 56 మందికి, ఇన్పుట్ సబ్సిడీ 77 మందికి మరియు సున్నా వడ్డీ పంట రుణాలు 52 మందికి అందించామన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మాధవి, ఎంపీపీ థామస్, ఉప సర్పంచ్ రామాంజనేయరెడ్డి, ఎక్స్ ఎంపీటీసీ శ్రీనివాసులు రెడ్డి, డీలర్ వెంకటసుబ్బారెడ్డి, ఎంపీడీవో రమణారెడ్డి మరియు రైతులు పాల్గొన్నారు.

## ప్రొద్దుటూరులో దారుణ హత్య



ప్రొద్దుటూరు క్రైం, జులై 14, ప్రభాతవార్త:

ప్రొద్దుటూరు మండలం కాన పల్లె ఎస్సీ కాలనీలో శుక్రవారం తెల్లవారు జామున దారుణ హత్య జరిగింది. పోలీసులు, స్థానికుల వివ రాల మేరకు కానపల్లె ఎస్సీ కాలనీ లో నివాసం ఉంటున్న ఆకుమల్ల నాగేంద్ర బాబు తన ఇంటి మిద్దెపై నిద్రిస్తున్న సమయంలో గుర్తు తెలియని దుండగులు గొంతు కోసి దారుణంగా హత్య చేసి పరారయ్యారు. భర్త ఎంత సేపటికి రాకపోవడంతో మిద్దెపైకి వెళ్లి చూసిన మృతుడి భార్య రక్తపు మడుగులో ఉన్న భర్తను చూసి కేకలు వేస్తు బోరున విలపించింది. మృతుడికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. పక్కింటి పై భాగం నుంచి దుండగులు వచ్చి వెళ్లినట్లు రక్తపు మరకల ఆనవాళ్లు లభించాయన్నారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## ఇండియన్ టాలెంట్ టెస్ట్‌లో స్టేట్ అవార్డు పొందిన తేజేస్

వార్త II వ పేజీలో

## 9, 10 వార్డులలో సమస్యలను పరిష్కరిస్తాం

**- ఎమ్మెల్యే డా॥ సుధ**

బద్వేలు అర్బన్, జూలై 14 ప్రభాతవార్త :



మున్సిపాలిటీ పరిధిలోని 9, 10వ వార్డులో శుక్రవారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని మున్సిపల్ ఛైర్మెన్ వాకమళ్ళ రాజగోపాల్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా హాజరైన ఎమ్మెల్యే డా॥ సుధ గడప గడపకూ తిరిగి ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రతి గడపకు ప్రభుత్వ పథకాలు సచివాలయ వ్యవస్థ ద్వారా లబ్ధిదారులకు అందుతున్నాయని, కుల, మతాలకు, పార్టీలకు అతీతంగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ప్రతి సంక్షేమ పథకం లబ్ధిదారులకు చేరే విధంగా అందజేస్తున్నామన్నారు. రాష్ట్ర ప్రజల సంక్షేమం, అభివృద్ధే ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి లక్ష్యం అని, ఆ దిశగా నవరత్నాలు పథకాలను ప్రవేశపెట్టి అమలుచేసి ప్రజలందరి ఆదరాభిమానాలు పొందారన్నారు. గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రజలు ఎమ్మెల్యేతో పాటు పలువురు నాయకులకు ఘన స్వాగతం పలుకుతూ ప్రభుత్వం అందిస్తున్న పథకాలపై హర్షం వ్యక్తం చేశారు. 9, 10 వార్డులలో ప్రజలు వార్డులలో సీసీ రోడ్లు, డ్రైనేజీ కాలువలు అస్తవ్యస్థంగా ఉన్నాయని, వార్డులలోని సమస్యలను పరిష్కరించాలని పలువురు ప్రజలు వార్డులలోని సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకుపోయారు. ముఖ్యంగా కొలిమి వీధి సందులో డ్రైనేజీ కాలువలు లేక ఎక్కడి నీరు అక్కడే స్తంభించి మురికి నీరు బయటికి పోకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, డ్రైనేజీ కాలువలను ఏర్పాటు చేయించి ప్రజలకు మెరుగైన సేవలందించాలని వార్డు ప్రజలు ఎమ్మెల్యేకు విన్నవించుకున్నారు. గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే డా॥ సుధాకు రాచపూడి కళ్యాణమ్మ, హైమావతి కుటుంబ సభ్యులు సాదరంగా ఆహ్వానం పలికి శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమీషనర్ కల్లూరు వెంకట కృష్ణారెడ్డి, మున్సిపల్ కన్వీనర్ యద్దారెడ్డి, ఏపి సివిల్ సప్లయ్స్ కార్పొరేషన్ డైరెక్టర్ సుందరరామి రెడ్డి, 9వ వార్డు కౌన్సిలర్ చెవుల వెంకటేశ్వర్లు, 10వ వార్డు కౌన్సిలర్ డా॥ శీను, సరిటాల మౌలాలి, సాంబశివా రెడ్డి, మాలే రామచంద్రా రెడ్డి, సచివాలయ సిబ్బందితో పాటు పలువురు వైసీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## అంగన్వాడి బిల్డింగ్‌లు త్వరితగతిన పూర్తి చేయాలి

**వీడియో కాన్ఫరెన్స్‌లో అధికారులను ఆదేశించిన కలెక్టర్**

రాయచోటి, జూలై 14 ప్రభాతవార్త :



నాడు నేడులో మంజూరైన అంగన్వాడి బిల్డింగ్ లన్నీ త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ గిరిషా పి.ఎస్ ఐసిడిఎస్ సిడిపిఓ సూపర్వైజర్ లను ఆదేశించారు. శుక్రవారం అన్నమయ్య జిల్లా కేంద్రం కలెక్టరేట్ లోని మినీ వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో ఐసిడిఎస్ సిడిపిఓ, సూపర్వైజర్లతో కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రూఫ్ లెవల్ లో బిల్డింగ్ లన్ని ఈ నెల ఆఖరికి పూర్తి కావలన్నారు. నవజాతి శిశువు నుంచి ఆరు నెలలు, ఏడు నెలల నుంచి 36 నెలలు, 37 నెలల నుంచి 72 నెలల పిల్లల పెండింగ్ ఆధార్ ఎన్‌రోల్‌మెంట్ త్వరగా పూర్తి చేయాలన్నారు. సుస్థిర అభివృద్ధి లక్ష్యాల పై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ఉండాల్సిన బరువు కన్నా తక్కువ, ఉండాల్సిన ఎత్తు కన్నా తక్కువ ఉన్న పిల్లల పై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు. అంగన్వాడి కేంద్రాల పై సిడిపిఓ లు, సూపర్వైజర్లు తప్పకుండా పర్యవేక్షణ చేయాలన్నారు. వై.ఎస్.ఆర్ సంపూర్ణ పోషణ కిట్స్ బాలామృతం, గుడ్లు, పాలు, బియ్యం, కందిపప్పు, నూనె క్వాలిటీని పరిశీలించాలన్నారు. అవన్నీ పిల్లలకు గర్భిని మహిళలకు, బాలింతలకు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి వారం అంగన్వాడి కేంద్రాలను మహిళా పోలీసులు తనిఖీ చేయాలన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో ఐసిడిఎస్ పిడి ధనలక్ష్మి, సిడిపిఓలు, సూపర్వైజర్లు, ఐ.సి.డి.ఎస్ సిబ్బంది, మహిళా పోలీసులు పాల్గొన్నారు.



సి.ఎం. రిలీఫ్ ఫండ్ కింద విజయలక్ష్మికి రూ.8.50 లక్షల చెక్కును అందజేసిన ఉపముఖ్యమంత్రి అంజాద్ బాషా

## శాకాంబరిదేవి అలంకారంలో కన్యకా పరమేశ్వరి దేవి

మైదుకూరు జులై 14, ప్రభాతవార్త



మైదుకూరు పట్టణం నంద్యా ల రోడ్డులో గల అమ్మవారిశాల యందుగల శ్రీ వాసవికన్యకా పరమేశ్వరిని శుక్రవారం భక్తులు శ్రీ శాకాంబరి దేవిగా అలంకారం నిర్వహించారు. పట్టణంలోని శ్రీ వాసవి మాతాకు ఆషాఢ మాసం సందర్భంగా వివిధ కూరగాయలు ఆకుకూరలతో అమ్మవారికి ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కలిగించారు. మహిళా మూర్తులు కడప రోడ్డులోని సాయిబాబా గుడి వద్ద నుండి మేళా తాళాలతో, మంగళవాయుద్యాలతో అమ్మవారికి ప్రత్యేకంగా ఆకుకూరలు, కూరగాయలు తీసుకోని వచ్చి ఆలయ ప్రధాన అర్చకుల ఆధ్వర్యంలో మహిళలచే ప్రత్యేకంగా పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

## ఎన్ఎస్ఎస్ నిధుల వినియోగంపై శిక్షణా తరగతులు

వైవీయూ జులై 14, ప్రభాతవార్త



పబ్లిక్ ఫైనాన్స్ మేనేజ్మెంట్ విధానం ద్వారా జాతీయ సేవ పథకం నిధుల వినియోగం పార దర్శకత ఉంటుందని రాష్ట్ర పిఎం ఎఫ్ఎస్ ఆఫీసర్ రవి కుమార్ అన్నారు. ఎన్ఎస్ఎస్ నిధుల విని యోగంలో భాగంగ ఈ శుక్రవారం వైవియూఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్ఎస్ఎస్ నిధులను వినియోగదారులకు, ఇతర ఖాతాలకు ఎలా జమ చేయాలో అవగాహన కల్పించారు. ఎన్ఎస్ఎస్ వైవియూ ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ ఎన్ వెంకటరామిరెడ్డి ఈ నూతన విధానం ద్వారా ఒక క్రమ పద్ధతిలో వినియో గించడమే కాకుండా పారదర్శకత పెరుగుతుందన్నారు. జీరో బ్యాలెన్స్ సబ్సి డరీ అకౌంట్స్ గురించి అవగాహన కల్పించారు. ఎన్ఎస్ఎస్ పిఓల సందేహాల నివృత్తి చేశారు. కార్య క్రమంలో జిల్లాలోని 121 యూనిట్ల ప్రోగ్రాం ఆఫీ సర్లు, శ్రీ వెంకటేశ్వర వెటర్నరీ విశ్వవిద్యాలయ పిఓలు, వైవియు అధ్యాపకుడు డాక్టర్ రాజగోపాల్‌రెడ్డి, ఎన్ఎస్ఎస్ సిబ్బంది మధుసూదన్ రెడ్డి

## వెన్నెల స్లీపర్ బస్సులు నడపాలని ఆర్టీసీ ఛైర్మన్‌ను కోరిన ఎమ్మెల్యే

జమ్మలమడుగు, జులై 14, ప్రభాతవార్త:



జమ్మలమడుగు టౌన్ నందు ఆర్టీసీ బస్టాండు ఆవరణలో ప్రభుత్వ స్థలం ఎక్కువగా ఉన్నందున స్థలాన్ని షాపింగ్ కాంప్లెక్సు నిర్మించాలని జమ్మలమడుగు డిపోకు కొత్త వెన్నెల స్లీపర్ బస్సులు మంజూరు చేయాలని ఆర్టీసీ ఛైర్మన్ మల్లికార్జునరెడ్డిని శుక్రవారం జమ్మలమడుగు ఎమ్మెల్యే డా.మూలె సుధీర్‌రెడ్డి కోరారు. ఈ సందర్భంగా ఆయన సానుకూలంగా స్పందించినట్లు ఎమ్మెల్యే తెలిపారు.

## మహాశక్తి కార్యక్రమ ప్రారంభోత్సవానికి హాజరైన తెలుగు మహిళలు

ఓబులవారిపల్లె, జులై 14, ప్రభాతవార్త:



భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా మహాశక్తి కార్యక్రమాన్ని అమరావతిలో మంగళగిరిలో శుక్రవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి కడప జిల్లా తెదేపా మాజీ ఉపాధ్యక్షుడు జి.అభినేత్ర ఆధ్వర్యంలో మహిళలు పాల్గొన్నారు. తల్లికి వందనం, ఆడబిడ్డ నిధి, ఉచిత బస్సు ప్రయా ణం, దీపం పేరుతో ఈ మహాశక్తి కార్యక్రమాన్ని ప్రారంభించడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా అమరావతిలో మహిళలు మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో అత్యధిక మెజార్టీతో గెలిపించాలని సీఎంగా చేయడమే ధ్యేయమని మహిళలు పిలుపునిచ్చారు. తెదేపా కడప జిల్లా మాజీ ఉపాధ్యక్షుడు అభినేత్ర తెలుగు మహిళలు రమ్య, జ్యోతి అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

## ఇద్దరు యువకులపై నలుగురు యువకులు దాడి- కేసు నమోదు

కలికిరి, జులై 14, ప్రభాతవార్త:



కలకడ రోడ్డు నందు గల ఖతీఫ్ గార్డెన్ వద్ద ఈనెల 13న రాత్రి ఇద్దరు వ్య క్తులు అరుచుకుంటుండగా సమీపంలోని తన ఇటుకల ఫ్యాక్టరీ వద్దకు వెళ్తూ ఉండగా మహ్మద్ సనావుల్లా వారిని దండించి అక్కడి నుంచి పంపివేయగా కొద్ది సేప టికి వారి అనుచరులైన కలికిరి టౌన్‌కు చెందిన యాసీన్, షాదిక్, అల్తాఫ్ మరి యు యాసీన్ బంధువు బెంగళూరుకు చెందిన ఇర్ఫాన్ అనే వారు సదరు ఇటుకల ఫ్యాక్టరీ ఆవరణలోనికి దౌర్జన్యంగా వెళ్లి మహ్మద్ సనావుల్లాను, అడ్డుపడిన అతని స్నేహితుడు ముదస్సర్ అహ్మద్‌ను కట్టెలు, ఇనుప పైపుతో కొట్టి తీవ్రంగా గాయ పరిచారు. వారి అరుపులు విన్న సమీపంలో వారు వచ్చి బాధితులను పై వారి నుంచి కాపాడి కలికిరి ప్రభుత్వ ఆసుపత్రికి రతలించారు. చికిత్స పొందిన అనంతరం శుక్రవారం ఉదయం ఇరువురు బాధితులు కలికిరి పోలీసు స్టేషన్‌కు వచ్చి జరిగిన దానిపై ఫిర్యాదు చేయగా కలికిరి ఎస్సై ఎస్.కె.రహీముల్లా ఆదేశాలపై ఏఎస్సై మధుసూధనాచారి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## ప్రభుత్వం సబ్సిడీ ధరలకు టమోట అమ్మకాలు చేపట్టాలి: సీపీఎం

జమ్మలమడుగు, జులై 14, ప్రభాతవార్త:

జమ్మలమడుగు పట్టణంలో సబ్సిడీ ధరలకు ప్రజలకు అందు బాటులోకి వచ్చే విధంటా టమోటా లను అందజేయాలని సీపీఎం జమ్మ లమడుగు కార్యదర్శి వీర ణాల శివ నారాయణ తెలిపారు. స్థానిక ఎన్జీవో కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో పేర్కొన్నారు. మార్కెట్‌లో కిలో రూ.130 నుంచి రూ.160 అమ్ము తున్నారని ప్రజలు టమోటాలకే అంత డబ్బులు వెచ్చించి ఏమి తినగలరని ప్రభు త్వం తక్షణమే సబ్సిడీ ధరలకు టమోటాలు విక్రయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రసాద్‌రెడ్డి, కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

## కొర్ర విత్తనాల ప్యాకెట్లు పంపిణీ

జమ్మలమడుగు, జులై 14, ప్రభాతవార్త:



ముద్దనూరు మండలం యామవరం రైతు భరోసా కేంద్రంలో ఎస్ఐఏ 3156 కొర్ర రకాన్ని చిరు సంచుల పథకం కింద 31 మంది రైతులకు ఒక్కొక్క రైతుకు 4 కిలోల చొప్పున పంపిణీ చేసినట్లు మండల వ్యవసాయాధికారి మారెడ్డి వెంకట కృష్ణారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యామవరం గ్రామంలో ఎక్కువ విస్తీర్ణంలో రైతులు కొర్ర పంట సాగు చేస్తారని అందువల్ల ఈ గ్రామానికి ఎంపిక చేసి కొర్ర పంట సాగు చేసే రైతులకు విత్తనాల ప్యాకెట్లు వంద శాతం రాయితీతో ఉచితంగా పంపిణీ చేయ డం జరిగిందని తెలిపారు. ప్రతి రైతు పంట సాగు చేయాలన్నారు. కార్య క్రమంలో గ్రామ వైసీపీ నాయకుడు శంకర్‌రెడ్డి, గ్రామ ఎంపీఈవో గంగయ్య, రైతులు పాల్గొన్నారు.

## శాకాంబరిదేవి అలంకారంలో అమ్మవారు

దువ్వూరు, జులై 14, ప్రభాతవార్త:



శ్రీవాసవీ కన్యకా పరమేశ్వరి దేవస్థానంలో శుక్రవారం మూలవిరాట్టు వాసవీ మాతకు శ్రీశాకాంబరీ అలం కారం నిర్వహించారు. స్థానిక అమ్మ వారిశాలలోని శ్రీవాసవీ మాతకు ఆశాడమాసం సందర్భంగా వివిధ రకాల కూరగాయలు, ఆకుకూరలతో అమ్మవారికి ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం గావించారు. అలాగే ఆర్యవైశ్య మహిళలతో ప్రత్యేక పూజలు నిర్వహిం చారు. ఈ సందర్భంగా సంఘం అధ్య క్షులు లింగం పట్టాభిరామయ్య మాట్లా డుతూ ప్రతి ఏడాది ఆశాడ మాసంలో భక్తులకు దర్శనం కల్పిస్తున్నామన్నారు.

## గ్రామాలలో 3 నెలలుగా కన్పించని ఎండియు వాహనం

బ్రహ్మంగారి మఠం, జులై 14 ప్రభాతవార్త :

గ్రామీణ ప్రాంతాలలో ప్రజలు చౌక దుకాణాలకు వెళ్ళడానికి గతంలో కొన్ని కిలోమీటర్ల మేర నడిచి వెళ్ళవలసివచ్చేది. ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి అధికారంలోకి వచ్చిన తరువాత వాహనాల ద్వారా లబ్ధిదారుల ఇంటి వద్దకే చౌక దుకాణం పంపిణీ చేసేవారు. గత 3 నెలల నుండి బసవాపురం, తెలుగు గంగ కాలని, ఎస్టీ కాలని, గొడ్లవీడు, దిరసవంచ గ్రామాలలో ఎండియు వాహనం ద్వారా పంపిణీ చేయకపోవడం విచారకరం. చౌక బియ్యం వాహనాల కోసం మహిళలకు ఎదురుచూపులు తప్పడం లేదు. ప్రతి నెలా 1వ తారీఖున రావలసిన వాహనం 3 నెలల నుండి రాకపోవడంతో కిలోమీటర్ల మేర నడుచుకుంటూ వెళ్ళి రావడం ఇబ్బందికరంగా ఉందని, గ్రామాలకు రేషన్ వాహనం సకాలంలో వచ్చేలా చూడాలని పలువురు మహిళలు మండల తహసీల్దారును కోరగా తహసీల్దారు మండలంలో 11 వేల పైచిలుకు రేషన్ కార్డులు ఉన్నాయని, వాటిలో 6500 మందికి పైగా రేషన్ అందించడం జరిగిందని, మిగిలిన లబ్ధిదారులకు రెండు రోజులలో పంపిణీ చేస్తామని, అలా చేయని ఎండియు వాహనదారులపైన చర్యలు చేపడుతామని తహసీల్దారు సువర్ణ దేవి హామీ ఇచ్చారు.

## ఓటీఎస్ రిజిస్ట్రేషన్ పూర్తి చేయండి..

తంబళ్లపల్లె, జులై 14, ప్రభాతవార్త:



తంబళ్లపల్లె మండలంలో గతంలో పలువురు లబ్ధిదారులు తమ గృహాలను ఓటీఎస్ (వన్ టైం సెటిల్‌మెంట్) ద్వారా రిజిస్ట్రేషన్‌కు ఫీజులు చెల్లించారు. వారి పేరుతో వెంటనే రిజిస్ట్రేషన్‌ల కార్యక్రమం పూర్తి చేయాలని ఎంపీడీవో సురేంద్రనాథ్ కార్యదర్శులను ఆదేశించారు. శుక్రవారం ఓటీఎస్‌పై కార్యదర్శులకు ఆయన పలు సూచనలు, సలహాలు చేశారు. ఓటీఎస్ రిజిస్ట్రేషన్ల కార్యక్రమంలో రెవెన్యూ అధికారులతో పాటు హౌసింగ్ అధికారుల సహకారంతో పూర్తి చేయాలన్నారు. మండలంలోని 21 పంచాయతీలలో ఇప్పటికే 74 మందికి ఓటీఎస్ రిజిస్ట్రేషన్లు చేయాల్సి ఉందని యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జి ఈవో ఆర్డీ రాజశేఖర్ నాయక్, హౌసింగ్ అధికారి చక్రపాణిరెడ్డి, కార్యదర్శులు పాల్గొన్నారు.

## జగనన్న సురక్ష కార్యక్రమంలో ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి

కమలాపురం, జులై 14, ప్రభాతవార్త:



జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా ఎర్రగుడిపాడు సచివాలయం, నగర పంచాయతీలోని 3వ వార్డు సచివాలయాల్లో 11 రకాల సర్టిఫికెట్లు ఎలాంటి రుసుము లేకుండా పూర్తి ఉచితంగా కమలాపురం ఎమ్మెల్యే పి.రవీం ద్ర నాథ్‌రెడ్డి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలోనే కాదు మొత్తం ప్రపంచంలోనే ప్రజలకు గ్రామ మరియు వార్డు సచివాలయాల ద్వారా మెరుగైన సేవలు అందిస్తున్న ఏకైక ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అని తెలిపారు. కార్యక్రమంలో మండల, స్థానిక నాయకులు, ప్రజా ప్రతి నిధులు, అధికారులు, అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

## మిద్దెపై నుంచి కింద పడి మహిళకు తీవ్ర గాయాలు

### - పరిస్థితి విషమం

లక్కిరెడ్డిపల్లె, జులై 14, ప్రభాతవార్త:



బేల్దారి కూలి పనులకు వెళ్లి మిద్దె పనులు చేస్తుండగా శుక్రవారం మిద్దెపై నుంచి ప్రమాదవశాత్తు కింద పడి రజని(25) అనే హహిళకు తీవ్ర గాయాలయ్యాయి. రజిని కుటుంబీకులు నెల రోజుల క్రితం గుర్రంకొండ మండలం కమ్మన్నగారిపల్లె నుంచి లక్కిరెడ్డిపల్లికి బేల్దారి పనులు చేస్తూ జీవనం సాగించే వారు. బతుకుదెరువు కోసం వచ్చిన రజిని మిద్దెపైన పనులు చేస్తూ ఉండగా పైనుంచి ప్రమాదవశాత్తు కింద పడిందని స్థానికులు, బంధువులు తెలిపారు. ఈ మేరకు వెంటనే స్థానికులు లక్కిరెడ్డిపల్లె ప్రభుత్వ ఆసుపత్రులకు తరలించగా బంధువులు, స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ రజిని పరిస్థితి విష మంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం డాక్టర్లు కడప రిమ్స్‌కు తరలించినట్లు బంధువులు తెలిపారు.

## ఆలయాల నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని వినతి

జమ్మలమడుగు, జులై 14, ప్రభాతవార్త:



జమ్మలమడుగు ఎమ్మెల్యే డా.మూలె సుధీర్‌రెడ్డి విజయవాడలోని గొల్లపూడి లో ఉన్న దేవాదాయశాఖ కార్యాలయానికి శుక్రవారం వెళ్లి మైలవరం మండలం నవాబుపేట పంచాయతీలోని పురాతన దేవాలయమైన శ్రీ మూలమ్మ దేవత ఆలయ పున: నిర్మాణానికి కొండాపురం మండలం లావనూరు గ్రామంలోని శ్రీకోదండ రామాలయ నిర్మాణానికి కావాల్సిన నిధులు మంజూరు చేయాలని దేవాదాయశాఖ కమిషనర్ సత్యనారాయణను కలిసి విన్నవించారు.

## జమ్మలమడుగులో భవిష్యత్తుకు గ్యారెంటీ..

జమ్మలమడుగు, జులై 14, ప్రభాతవార్త:



జమ్మలమడుగు మున్సిపాలిటీ పరిధిలోని నీళ్ల ట్యాంక్ వీధిలో భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఇందులో జమ్మలమడుగు తెదేపా ఇన్‌ఛార్జి భూపేష్ సుబ్బరామిరెడ్డి ముందుగా శ్రీకృష్ణదేవరాయుల విగ్రహా నికి పూలమాల వేసి అనంతరం తెదేపా నాయకులు, కార్యకర్తలతో కలిసి ప్రతి ఇంటికి తిరుగుతూ మినీ మేనిఫెస్టోను వివరించారు. అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చిన జగన్ విద్యుత్తు ఛార్జీలు, బస్ ఛార్జీలు, ఇంటి పన్నులు పెంచి పేద, మధ్య తరగతి వారికి తీవ్ర అన్యాయం చేస్తున్నారన్నారు. తెదేపా అధికారంలోకి వస్తే 18 సంవత్సరాల నుంచి 60 సంవత్సరాల మహిళలకు నెలకు రూ.15వేలు అందిస్తారని సంవత్సరానికి 3 గ్యాస్ సిలిండర్లు ఉచితంగా ఇవ్వడం జరుగుతుందన్నారు. చదువుకుంటున్న పిల్లలకు కుటుంబంలో ఎంత మంది ఉన్నా ఒక్కొక్కరికి రూ.15వేలు అందుతుందన్నారు. మహిళలకు బస్సులలో ఉచిత ప్రయాణం కల్పించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి రమణారెడ్డి, నవనీశ్వర్ రెడ్డి, రాయల్ కిరణ్, హరిరాయల్, ఓబుల్‌రెడ్డి, మురళీ, శివన్న, ప్రసాద్, శ్రీను, గుర్రప్ప, సుధీర్ గుప్త, సుబ్బయ్య గుప్త, సందీప్‌కుమార్, గిరి, బాల పుల్లారెడ్డి, శ్రీనివాసులు, గురుస్వామి, దుర్గాప్రసాద్, జింకా ప్రసాద్, మల్లికా ర్జున, రఫీ, నాగరాజు, నవీన్ రాయల్, ఐఎల్ చిన్న, జయచంద్ర, ఫిలీప్, మస్తాన్, గైబు, సర్దార్, హనుమంతు నాయక్, తెదేపా నాయకులు, కార్యకర్తలు, దేవగుడి కుటుం బ అభిమానులు పాల్గొన్నారు.

## భక్తులకు అన్నదానం

పీలేరు,జూలై 14 ప్రభాతవార్తః



నెల్లూరుకు చెందిన దాతలు జయ రాం, ఆయన సతీమణి లత శుక్రవారం కలికిరి శ్రీయల్లమ్మ జాతరలో భక్తులకు అన్నదానం చేపట్టి తమ దాతత్వం చూపా రు. ప్రతి ఏడాది యల్లమ్మ జాతరకు వారు హాజరై యల్లమ్మ అమ్మవారికి ప్రత్యేకంగా పూజలు నిర్వహించి భక్తులకు అన్నదానం చేస్తున్నారు. ఈ సందర్భం గా జయరాం ఆయన సతీమణి మాట్లాడుతూ తమ కుటుంబ ఇలవేల్పుగా శ్రీయల్లమ్మ అమ్మవారిని కొలుచుకుంటున్నామని అమ్మవారి సేవలో పాల్గొని భక్తులకు అన్నదానం చేయడం తమకు ఎంతో సంతప్తిని ఇచ్చిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో వారి కుమారులు తేజ, ధర్మ, మస్తాన్, వాసు, భరత్ పాల్గొన్నారు.

## ప్రతి ఉద్యోగికి బదిలీ సహజమే

రామాపురం జులై 14, ప్రభాతవార్త



ప్రభుత్వ పాఠశాలలో పనిచేసే ప్రతి ఉపాధ్యాయునికి బదిలీలు సహజమేనని ఎంఈఓ రామకృష్ణుడు. ఎంఈఓ 2 జయ చంద్ర అన్నారు. మండలంలోని నల్లగుట్ట పల్లి పంచాయతీ. బి రాచపల్లిలో బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయుడు జి.సి.వెంకటసుబ్బయ్య వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధ్యాయుడు జి.సి.వెంకట సుబ్బయ్య పాఠశాలకు పాఠశాలకు అన్ని మౌళిక వసతులు కల్పించి విద్యార్థుల సంఖ్యను పెంచి పాఠశాల అభివృద్ధికి కృషి చేశారని కొనియాడారు.కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ అయోధ్యపురం నాగభూషణ్ రెడ్డి. మల్లి రెడ్డి శ్రీధర్ రెడ్డి. ఉపాధ్యాయులు రామచంద్ర. చంద్రశేఖర్ రెడ్డి. నాగభూషణ్ రెడ్డి. రాజారెడ్డి. జయరాం రెడ్డి. పాల్గొన్ రెడ్డి.

## వాలంటరీ వ్యవస్థను రద్దు చేయాలని జనసేన నేతలు ఆర్‌డిఒకు వినతి

రాజంపేట అర్బన్, జులై 14 ప్రభాతవార్త



వాలంటరీ వ్యవస్థ రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ జనసేన నేతలు,జనసేన అసెంబ్లి ఇన్‌ఛార్జి మలిశెట్టి వెంకటరమణ ఆధ్వర్యంలో శుక్రవారం రాజంపేట ఆర్‌డిఒ భాస్కర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా అసెంబ్లి ఇన్‌ఛార్జి మలిశెట్టి వెంకటరమణ మాట్లాడుతూ లోపభూయిష్టమైన వాలంటరీ వ్యవస్థతో ప్రజల వ్యక్తిగత సమాచారం ఇతరుల చేతికి పోయిందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన నేతలు ఆకుల నరసయ్య, భాస్కర పంతులు, కత్తి సుబ్బరాయుడు, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందాలన్నదే జగనన్న సురక్ష లక్ష్యం

### వైస్ ఎంపిపి మిట్టపల్లి యదుభూషణ్‌రెడ్డి

గాలివీడు జులై 14, ప్రభాతవార్త



అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందాలన్నదే జగనన్న సురక్ష లక్ష్యమని వైస్ యం పి పి మిట్టపల్లి యదు భూషణ్ రెడ్డి పేర్కొ న్నారు. శుక్రవారం గాలివీడు 3 సచివాలయ పరిధిలో జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో... ముఖ్య అతిధిగా పాల్గొన్న యదు భూషణ్‌రెడ్డి మాట్లాడుతూ జగనన్నకు చెబుదాం అనే కార్యక్రమానికి కొనసాగింపుగా ఈ జగనన్న సురక్ష కార్యక్రమం జరుగుతుందని ఈ కార్య క్రమంలో ప్రజలకు కావాల్సిన 15 రకాల ధ్రువపత్రాలు అన్ని ఉచితంగానే ఇవ్వ డం జరుగుతుందని తెలిపారు ఇంకా ప్రభుత్వ పథకాలకు అర్హులయ్యి కూడా అందని వారు ఎవరైనా ఉంటే అటువంటి వారిని గుర్తించి.. వారికి కూడా పథకాలు అందజేయడం జరుగుతుందని తెలిపారు రైస్ కార్డ్, ఆరోగ్యశ్రీ కార్డు కూడా కొత్తవి మంజూరు చేస్తారని ఈ అవకాశాన్ని ప్రజలు అందరు ఉపయోగించు కోవాలని చెప్పారు. ఈ సచివాలయ పరిధిలో వ్యవసాయ ఆధారిత రైతులు ఎక్కువ వున్నారని మన ప్రభుత్వంలో రైతులకు ఎంతో మేలు జరిగిందని ఎన్నో సంవ త్సరాల నుండి వున్న చుక్కల భూముల సమస్యను మన ప్రభుత్వమే పరిష్కరిం చిందని మనది రైతు పక్షపాత ప్రభుత్వమని తెలిపారు లబ్దిదారులకు ధ్రువపత్రా లు అందజేశారు. కార్యక్రమంలో గాలివీడు సర్పంచ్ మిట్టపల్లి లక్ష్మీదేవి, ఎంపిడిఓ శ్రీనివాసులు రెడ్డి, పంచాయతీ కార్యదర్శి సురేష్, శివ నాయక్, సచివాలయ ఉద్యోగులు, వాలంటీర్లు, రెవెన్యూ సిబ్బంది, మాజీ ఎంపీటీసీ కృష్ణ, సచివాలయం కన్వీనర్ సుబ్బారెడ్డి, వార్డు మెంబర్లు ఆదినారాయణ రెడ్డి,వెంకటయ్య, వైసీపీ నాయకులు ప్రతాప్ రెడ్డి,గంగాధర్ నాయుడు, వినోద్ నాయుడు,సూరి, భరత్ కుమార్, రెడ్డికుమార్, వనిత మార్ట్ గంగాధర్,కే. సుబ్బారెడ్డి, చక్రపాణి, స్థానిక నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

## రైతులకు మంచి సలహాలు ఇవ్వండి : ఎంపీపీ

వీరబల్లి జులై 14, ప్రభాతవార్త



రైతులకు సరైన సమయంలో సరైన సలహాలు ఇస్తే రైతులు మంచి ఆదా యం పొందుతారని ఎంపీపీ గాలివీటి రాజేంద్రనాథ్ రెడ్డి అన్నారు. శుక్రవారం వీరబల్లె మండల వ్యవసాయ సలహా మండలి సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజ రయ్యారు . ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు ఒక గ్రూప్ గా ఏర్పడి సొంతంగా స్టాక్ పాయింట్స్ ఏర్పాటు చేసుకుంటే ఎవరైనా తమ వద్దకు వచ్చి కొంటారని ఎలాంటి మధ్యవర్తిత్వం లేకుండా ఉంటుందని ఆ వచ్చే లాభమంతా రైతులకు ఉంటుందని తెలిపారు. రైతులు తమ పొలంలో పురుగు మందుల పిచికారి కోసం డ్రోన్స్ వాడాలని ప్రస్తుతం అవి అందుబాటు లోనే ఉన్నాయని, ఆ టెక్నాలజీని ఉపయోగించుకోవాలని తెలియజేశారు. ముఖ్యం గా మండల పరిధిలో మామిడి రైతులు ఎక్కువగా ఉన్నారని వారు ఏ ఏ కాలాలలో ఏ ఏ మందులు పిచికారి చేయాలో క్షుణ్ణంగా వివరించినట్లయితే అధిక దిగుబడితో అధిక లాభాలు పొందు తారని వారికి కావలసిన సూపర్, ఫాస్పెట్, నత్రజని వంటివి ఎంత మోతాదులో వాడాలో క్షుణ్ణంగా తెలియజేయాలని తెలిపారు. మం డల పరిధిలో ఉన్న రైతులకు సీజనల్ పంటల పట్ల అవగాహన కల్పించాలని తెలియజేశారు. కార్యక్రమంలో లక్కిరెడ్డిపల్లి ఏడి జయారాని, వీరబల్లె ఏ ఓ స్వాతి, ఏపిఓ ఖాదర్‌వలీ, ఆర్‌బికే అసిస్టెంట్స్, తాటిగుంట్లపల్లి సర్పంచ్ గోపీనాథ్ రెడ్డి, రవికుమార్‌రెడ్డి, మణిరాజు, శ్రీరాములు రెడ్డి, రామకృష్ణారెడ్డి, వెంకట్రాం రెడ్డి, చలపతి నాయుడు, మోహన్ రాజు మొదలైన వారు పాల్గొన్నారు.

## హాస్టల్ విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలి

కడప ఎడ్యుకేషన్, జులై 14, ప్రభాతవార్త:




జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ ఎస్సీ, ఎస్టీ, బీసీ హాస్టళ్లలో చదివే విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని రెవల్యూషనరీ స్టూడెంట్స్ యూనియన్ (ఆర్ఎస్‌యూ) ఆధ్వర్యంలో శక్రవారం కడప నగరంలో స్థానిక ప్రకాష్‌నగర్ చంద్రమౌళి పాఠశాల ఆవరణలో ప్రభుత్వ హాస్టళ్లకు మెస్ ఛార్జీలు విడుదల కాలేదన్నారు. మెస్ ఛార్జీలు విడుదల కాకపోవడం వల్ల హాస్టల్ వార్డెన్లు పూర్తి స్థాయిలో విద్యా ర్థులకు నాణ్యమైన భోజనం అందించలేక అనేక రూపాల్లో ఇబ్బంది పడుతు న్నారు. విద్యార్థులకు అందాల్సి కాస్మొటిక్ ఛార్జీలు విద్యార్థుల బ్యాంక్ ఖాతాలో జమ చేస్తామని అధికారులు చెబుతున్నారు. విద్యార్థులకు కాస్మొటిక్ డబ్బులు కావాలంటే బ్యాంక్ దగ్గరికి వెళ్లి డబ్బులు తీసుకోవా లంటే బ్యాంకు దగ్గరికి వెళ్లి డబ్బులు తీసుకురావాలంటే వాళ్ల ప్రయాణాలకే కాస్మొటిక్ డబ్బులు ఖర్చవు తున్నాయని విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారని ఆయన అన్నారు. లేనిపక్షంలో కలెక్టర్ కార్యాలయం ఎదుట హాస్టల్ విద్యార్థులను కలుపుకొని పెద్దఎత్తున ఉద్యమానికి శ్రీకారం చుడతామని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో ఆర్ఎస్‌యూ జిల్లా ఉపాధ్యక్షుడు చెన్నకేశవరెడ్డి, హరి, మదన్, పవన్, హాస్టల్ విద్యార్థులు పాల్గొన్నారు.

## ఎంఎస్ఎంకి ఎంపికైన ఎస్ఆర్ఐటీ అధ్యాపకుని ప్రతిపాదన

ప్రొద్దుటూరు క్రైం, జులై 14, ప్రభాతవార్త:



సాయిరాజేశ్వరి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఇంజినీరింగ్ కళాశాల సివిల్ విభాగంలోని అధ్యాపకుడు డా.వై.సుదర్శన్‌రెడ్డి సమర్పించిన 'ఐడెంట్‌పై వాటర్ కాంట ర్పైనేషన్ జోన్స్ యూజింగ్ అడ్వాన్స్‌డ్ జియో స్టిటిల్ టెక్నిక్స్' అనే ఆలోచన ప్రతిపాదన 'ఎంఎస్ ఎంఈ ఐడియా హకాతాన్ 2.ఓ' నందు ఆమోదం పొందిందని దేశ వ్యాప్తంగా 276 మంది సమర్పించిన వివిధ ప్రతిపాదనలలో 15లక్షల విలువల గల ఈ ప్రాజెక్టు ఎంపిక కావడం గర్వించదగిన విషయమని ప్రిన్సిపల్ డా.పాండురంగన్ రవి తెలిపారు. ఈ సంద ర్భంగా ఛైర్మన్ బసిరెడ్డి రాజేశ్వరరెడ్డి, వైస్ ప్రెసిడెంట్ వీరకుమార్‌రెడ్డి, కరస్పాం డెంట్ వీర కల్యాణ్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపల్ డా.ఎ.వెంకటేశ్వరరెడ్డి, అకడమిక్ డీన్ డా.వై. సుబ్బారెడ్డి, హెచ్ఓడీలు ఏవో జగదీశ్వర్‌రెడ్డి, అధ్యాపకులు హృదయ పూర్వక అభినందనలు తెలిపారు.

## తెలుగు దేశంతోనే రాష్ట్రాభివృద్ధి

### మాజీ ఎమ్మెల్యే రమేష్‌కుమార్‌రెడ్డి

గాలివీడు జులై 14, ప్రభాతవార్త



తెలుగుదేశం పార్టీతోనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని మాజీ ఎమ్మెల్యే రాయచోటి నియోజక వర్గం టిడిపి ఇంఛార్జ్ ఆర్ రమేష్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని గోరం చెరువు పంచాయతీలో రాష్ట్ర భవిష్యత్తుకు చంద్రబాబు గ్యారెంటీ, ఇదేమి కర్మ రాష్ట్రానికి అనే కార్యక్రమాలను నిర్వహించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ 2019 ఎన్నికలలో ఒక ఛాన్స్ అంటూ ప్రజలకు మాయ మాటలు చెప్పి జగన్ ఎన్నికలలో గెలుపొందారని ఈ నాలుగు సంవత్సరాలలో జగన్ చేసిన అరాచకం ప్రజలకు అర్థం అయిపోయిందని ఎప్పుడు ఎన్నికలు వచ్చినా ప్రజలు వైసీపీని సాగనంపడానికి సిద్ధంగా ఉన్నారని తెలిపారు రాష్ట్రం మొత్తం సైకో పాలన జరుగుతున్నదని ప్రభుత్వాన్ని ప్రశ్నించే వారిపై కేసులు పెట్టి చిత్రహింసలకు గురి చేస్తున్నారని విమర్శించారు టిడిపి హయాంలో రైతాంగానికి వారి సంక్షేమానికి ఎన్నో సంక్షేమ కార్యక్రమాలను చేపట్టిందని కొనియాడారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ వెంకట నారాయణ రెడ్డి మాజీ సర్పంచులు మహమ్మద్, రియాజ్, ప్రభాకర్ నాయుడు చిన్నపరెడ్డి, భద్రప్ప నాయుడు మాజీ ఎంపీటీసీ రెడ్డి ప్రసాద్ రెడ్డి క్లస్టర్ ఇంచార్జ్ సత్య రెడ్డి టిడిపి మండల నాయకులు రెడ్డప్ప రెడ్డి రాఘవులు శ్రీకాంత్ రెడ్డి మహబూబ్ బాషా గూడు సాబ్ జక్రియ భాష పాల్గొన్నారు.

## శ్రీ దుర్గాలమ్మకు మొక్కులు తీర్చుకున్న భక్తులు

రామసముద్రం, జులై 14, ప్రభాతవార్త :



మండల కేంద్రంలోని నాగరాజు చారి శుక్రవారం శ్రీ దుర్గాలమ్మకు మేళ తాళాలతో భక్తిశ్రద్ధలతో గేరిగెలు మోసి మొక్కులు తీర్చుకున్నారు కుటుంబ సభ్యులు ఉపవాస దీక్షలతో శ్రీ దుర్గమ్మకు ప్రత్యేక భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు.

## ఉచిత మెగా కంటి వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోండి

### మార్కెట్ కమిటీ ఛైర్మన్

రామాపురం జులై 14, ప్రభాతవార్త



తిరుపతికి చెందిన శ్రీ వెంకటేశ్వర అరవింద్ కంటి ఆసుపత్రి మధురై వారి శాఖ ఆధ్వర్యంలో మండలంలోని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయం నందు ఈనెల 20వ తేదీన ఉచిత మెగా కంటి వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు లక్కిరెడ్డిపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ విశ్వనాథరెడ్డి తెలిపారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు రాయచోటి శాసన సభ్యులు శ్రీకాంత్ రెడ్డి ఆధ్వర్యంలో ఈనెల 20వ తేదీ ఎనిమిది గంటలకు ఉచిత మెగా కంటి వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు మండలంలో కంటి సమస్యలతో బాధపడుతున్న ప్రజలు ఈ అవకాశాన్ని సద్విని యోగం చేసుకోవాలని ఆయన అన్నారు అనుభవజ్ఞులైన డాక్టర్లచే కంటి వైద్య పరీక్షలు చేయబడునని తెలిపారు. మండలంలోని గ్రామాల ప్రజలు ఈ కం టి వైద్య శిబిరాన్ని సద్విని యోగం చేసుకోవాలని వారన్నారు. వైద్య శిబిరానికి వచ్చిన అందరికీ ఉచితంగా పరీక్షలు, మందులు కూడా అందివ్వడం జరుగుతుంది. కార్యక్రమం లో సర్పంచ్ నాగభూషణ్ రెడ్డి వైఎస్ఆర్సిపి రాష్ట్ర యువజన విభాగం జనరల్ సెక్రెటరీ సూరం వెంకట సుబ్బారెడ్డి వడ్డెర కార్పొరేషన్ డైరెక్టర్ తిరుపతి ఆంజ నేయులు, శ్రీధర్ రెడ్డి చెన్నారెడ్డి, రాజు పాల్గొన్నారు

## వృద్ధాశ్రమంలో చీరలు, పంచెలు, టవళ్లు పంపిణీ

రామాపురం జులై 14, ప్రభాతవార్త



రాయచోటి లైన్స్ క్లబ్ ఆధ్వర్యంలో చిత్తూరు వాస్తవ్యులు రిటైర్డ్ స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఎంప్లాయ్ సుబ్ర మణ్యం ఆర్థిక సౌజన్యంతో బండపల్లి సమీ పంలోని ప్రేమాలయం వృద్ధాశ్రమంలో ఉండే వృద్ధులకు పంచెలు, టవల్లు, చీరలను శుక్రవారం ఆశ్రమం మేనేజర్ దేవ నాథ రెడ్డికి అందజేయడం జరిగిందని వ్యవ స్థాపక అధ్యక్షులు లయన్ పిఎస్ హరినాథ్ రెడ్డి తెలిపారు. అనంతరం దాత సుబ్రమణ్యం మాట్లాడుతూ ప్రజలకు ఉప యోగపడే సేవ చేయాలనే సంకల్పం తోనే బండపల్లి దగ్గర ఉండే ప్రేమాలయం వృద్ధాశ్రమంలో ఉండే వృద్ధులకు చీర లు, పంచెలు, టవల్లు పంపిణీ చేయడం జరిగిందని, రాబోయే రోజులలో ప్రజలకు ఉపయోగపడే మరిన్ని సేవా కార్యక్రమా లు చేయడానికి నా వంతు సహాయ సహకారాలు అందజేస్తానని తెలిపారు. కార్య క్రమంలో కార్యదర్శి లయన్ షేక్ ఇందాద్ అహమ్మద్,కోశాధికారి లయన్ విహరీష్ చంద్ర,లయన్ వి నారాయణ రెడ్డి ఆశ్రమం మేనేజర్ దేవనాథ రెడ్డి సభ్యులు పాల్గొన్నారు.

## సంపద వనరుల కేంద్రాన్ని సందర్శించిన ఈఓపిఆర్‌డి ఉషారాణి

రామాపురం జులై 14, ప్రభాతవార్త



మండలంలోని గువ్వల చెరువు గ్రామపంచాయతీ సంపద వనరుల కేంద్రాన్ని గ్రామ సచివాలయాన్ని శుక్రవారం ఈఓపీఆర్డి ఉషారాణి ఆకస్మికంగా సందర్శిం చారు. అనంతరం ఆమె విలేకరులతో మాట్లాడుతూ గ్రామంలో ఉన్న చెత్తాచెదారాలన్నీ గ్రీన్ అంబాసిడర్లకు తరలిస్తే వారు తడి చెత్త, పొడి చెత్తను వేరు వేరు చేసి సంపద వనరుల కేంద్రంలోకి చేర్చాలన్నారు. ఇందులో వానపాముల తయారీ, ద్వారా పంట పొలాలకు మంచి ఎరువులు తయారు చేసుకోవచ్చని ఆమె తెలిపారు. ఇందుకోసం ఆ గ్రామంలోని ప్రజలు అంతా గ్రీన్ అంబాసిడర్ లకు సహకరించాలన్నారు. ఈమె వెంట సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## చంద్రయాన్ - 3 విజయవంతంపై హర్షం

వైవీయూ జులై 14, ప్రభాతవార్త

ఇస్రో ఆధ్వర్యంలో ప్రతిష్ఠాత్మకంగా శుక్రవారం చేపట్టిన చంద్రయాన్-3 లాంచింగ్ ప్రక్రియ విజయవంతం కావడం పట్ల డాక్టర్ వైఎస్ఆర్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ఆర్ట్స్ విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ ఆచార్య బి. ఆంజనేయప్రసాద్ హర్షం వ్యక్తం చేశారు. భారతదేశ శాస్త్ర, సాంకేతిక పరిజ్ఞానం, మన శాస్త్రవేత్తల మేధస్సుకు తార్కాణంలా నిలిచిందని పేర్కొన్నారు. రానున్న రోజుల్లో భారత దేశం, ఇస్రో మరిన్ని విజయాలు సొంతం చేసుకుంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

## జగనన్న సురక్ష కార్యక్రమానికి విశేష స్పందన

### - మండల అభివృద్ధి కమిటీ ఛైర్మన్ నారాయణరెడ్డి

తంబళ్లపల్లె, జులై 14, ప్రభాతవార్త:



తంబళ్లపల్లె మండలంలో జరుగుతున్న జగనన్న సురక్ష కార్యక్రమాలు బారీ జన సందోహంతో విజయవంతం అవుతున్నట్లు మండల అభివృద్ధి కమిటీ ఛైర్మన్ నారాయణరెడ్డి తెలిపారు. శుక్రవారం మండలంలోని కొట్టాలలో సర్పంచ్‌లు సహదేవరెడ్డి, చెన్నకేశవరెడ్డిల ఆధ్వర్యంలో జగనన్న సురక్ష కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ సందప్ప మాట్లాడుతూ నేను కొటాలలోనే జన్మించారు. నాడు పాఠశాల, హాస్టళ్లో చేరడానికి సర్టిఫికెట్ల కోసం పడిగాపులు కాస్తూ చెప్పులు అరిగేలా తిరిగామని నేడు ఆ సమస్యలకు ఫుల్ స్టాఫ్ పెడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి మీ ఇంటికే సర్టిఫికెట్లు పంపిణీ చేసే కార్యక్రమం చరిత్రలో నిలిచిపోతోందన్నారు. మండల ఉపాధ్యక్షుడు కోటిరెడ్డి మాట్లాడుతూ ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి చొరవతో నేడు మారు మూల గ్రామాల్లో సైతం ఎనలేని అభివృద్ధి జరిగినట్లు కొనియాడారు. సర్పంచ్‌లు మాట్లాడుతూ మా పంచాయతీలలో జరిగిన అభివృద్ధి ఎమ్మెల్యే సహకారంతో జరిగాయని చెప్పారు. అనంతరం లబ్దిదారులకు సర్టిఫికెట్లను ప్రజా ప్రతినిధులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో సురేంద్రనాథ్, తహసీల్దార్ శ్రీని వాసులు, ఇన్‌ఛార్జి ఈవోఆర్డీ రాజశేఖర్ నాయక్, ఏపీఎం గంగాధర్, ఏపీవో అంజనప్ప, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ అశోక్, సీసీ ఆదిలక్ష్మి, వీఆర్వో మంజునాథ్, కార్యదర్శి నరసింహులు, ఎమ్మెస్ ప్రెసిడెంట్ కొట్టాల కుమారి, నంద, రహీం పాల్గొన్నారు.

